నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | ఆదివారం 26 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




ఎల్లూరు వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వేణుబాబు

# ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

● రైతులెవ్వరూ అధైర్య పడవద్దు ● జిల్లా అదనపు కలెక్టర్ వేణుబాబు

● 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన ● ఎల్లూరు, ఎల్కపల్లి, గొంట్లపేట

వరి కొనుగోలు కేంద్రాల సందర్శన ● ఎల్లూరు సెంటర్ నిర్వాహకుడి తొలగింపు

పెంచికల్ పేట్, మే 25 : ప్రతి గింజా కొనుగోలు చేస్తాం, రైతులెవ్వరూ అధైర్యపడవద్దని జిల్లా అదనపు కలెక్టర్ వేణుబాబు అన్నారు. శనివారం 'నమస్తే తెలంగాణ'లో మిల్లర్లు వద్దన్నరని.. వడ్లు కొనట్లే' శీర్షికన కథనం ప్రచురితమవ్వగా, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే స్పందించి ఆదేశించడంతో అదనపు కలెక్టర్ ఎల్లూరు, ఎల్కపల్లి, గొంట్లపేట వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వడ్లు కొనేందుకు అలసత్వం వహిస్తున్న నిర్వాకులపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి 40 కిలోల బస్తాపై కిలోన్నర వడ్లు నిర్వాహకులు సేకరిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 600 గ్రాములు మాత్రమే అదనంగా గన్నీ వెయిట్ కింద తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. గన్నీ సంచులను సెంటర్ పరిధిలోని వారికి కాకుండా వేరే వారికి అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎల్లూరు సెంటర్ నిర్వాహకుడు వెంకటేశ్వర్ గౌడ్‌ను తొలగిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకట నరసింహ, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ గోపాల్ ఉన్నారు.



మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**ఆసిఫాబాద్ ఎస్పీ కే సురేశ్‌కుమార్**

కాగజ్‌నగర్, మే 25: నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగుల మందులు, కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో ఎరువులు, విత్తనాల డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నకిలీ విత్తనాలు, నిషేధిత పురుగుల మందులను అరికట్టేందుకు పోలీసు శాఖ, వ్యవసాయ శాఖ సమన్వయంతో ప్రత్యేక టీం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా సరిహద్దుల్లో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందంతో నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తూ పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో నాణ్యమైన విత్తనాలు, పురుగుల మందులు విక్రయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తింపు పొందిన విత్తనాల దుకాణాల్లోనే విత్తనాలు, పురుగుల మందులు కొనుగోలు చేయాలన్నారు. బిల్లులు లేకుండా విత్తనాలు విక్రయిస్తే వెంటనే పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. డీలర్లు షాపుల ఎదుట ఎరువులు, విత్తనాల ధరల పట్టిక, లైసెన్స్ వివరాలతో బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి కృష్ణారెడ్డి, కాగజ్‌నగర్ ఆర్డీవో సురేశ్‌కుమార్, కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# సిర్పూర్(టీ)లో భారీ వర్షం

**పిడుగు పడి రెండు ఎడ్లు మృతి**

సిర్పూర్(టీ), మే 25 : సిర్పూర్(టీ) మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. డోర్‌పల్లిలో తాటి చెట్టుపై పిడుగుపడింది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కేశవపట్నంలో పిడుగుపడి రెండు ఎడ్లు మృత్యువాత పడ్డాయి. సిర్పూర్(టీ)-కౌటల ప్రధాన రహదారి డౌనల్ ప్రాంతం లో చెట్టు రోడ్డుపై పడింది. గంట పాటు ప్రయాణికులకు అంతరాయం ఏర్పడింది.



కేశవపట్నంలో పిడుగుపడి మృతిచెందిన ఎడ్లు

# ఆపద్బాంధవులు

● అత్యవసర సమయాల్లో అండగా నిలుస్తున్న 108 సిబ్బంది ● నిత్యం వందలాది మందికి ఊపిరి పోస్తున్న పైలెట్లు, ఈఎంటీలు

● కరోనా కాలంలో మెరుగైన సేవలతో భేష్ ● నేడు అంతర్జాతీయ పైలెట్స్ డే



కోటపల్లి, మే 25 : ఆపదలోనున్న వారికి మేమున్నామంటూ భరోసానిస్తున్నది 108 సిబ్బంది. సకాలంలో స్పందించి.. ప్రాణాలు రక్షించి.. వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నది. అత్యవసర సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రాణదాతలుగా నిలుస్తున్న అంబులెన్స్ ఉద్యోగుల సేవలపై అంతర్జాతీయ పైలెట్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

## నిత్యం సవాళ్లను ఎదుర్కొంటూ..

ఆపత్కాలంలో క్షణాల్లో ముందుండి ప్రాణాలను కాపాడే 108 సిబ్బంది సేవలను ఎంత కొనియాడినా తక్కువే. అంబులెన్స్ సకాలంలో ఘటనా స్థలానికి చేరాలన్నా.. అక్కడి నుంచి దవాఖానకు చేరాలన్నా పైలెట్ అప్రమత్తత ముఖ్యం. ప్రమాద స్థలం నుంచి హాస్పిటల్‌కు తీసుకు వచ్చే సమయాన్ని గోల్డెన్ అవర్‌గా భావిస్తారు. ఆ సమయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా.. ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. అత్యవసర సమయాల్లో వాహనాన్ని జాగ్రత్తగా నడుపకుంటే.. బాధితులతో పాటు పైలెట్, ఈఎంటీలకు ప్రమాదమే.. నిత్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటూ వందలాది మందికి ఊపిరిపోస్తున్న అంబులెన్స్ సిబ్బందికి ఏమిచ్చి రుణం తీర్చుకోగలం..



జాతీయ స్థాయిలో ఉత్తమ పైలెట్‌గా అవార్డు అందుకుంటున్న మందమర్రి 108 అంబులెన్స్ పైలెట్ రాజిరెడ్డి



బాధితుడిని 108 అంబులెన్స్ వద్దకు తీసుకు వస్తున్న పైలెట్, సిబ్బంది

## కొవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి..

108 సిబ్బంది.. కొవిడ్ సమయంలో ప్రమాదమని తెలిసినా కరోనా బాధితులకు వైద్య చికిత్సలు అందించి ప్రశంసలు అందుకున్నది. 24 గంటల పాటు అప్రమత్తంగా ఉంటూ కరోనా లక్షణాలు కలిగిన వారికి మెరుగైన వైద్యం అందించేందుకు నిరంతరం కృషి చేసింది. కొవిడ్ రోగులు, అనుమానితులను హాస్పిటల్స్‌కు తీసుకుపోవడం, ఐసొలేషన్‌కు తీసుకురావడంలో వారి పాత్ర మరవలేనిది. అంతటి క్లిష్ట పరిస్థితుల్లోనూ 108 సిబ్బంది రోగులకు సేవలు అందించి భేష్ అనిపించుకున్నది.

## ఏటా పైలెట్లకు ప్రత్యేక శిక్షణ

108 పైలెట్లకు హైదరాబాద్‌లోని జీవీకే ఈఎంఆర్ఐ కార్యాలయంలో ఏటా ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిని వారికి ప్రథమ చికిత్స చేయడం.. గర్భిణులకు సుఖ ప్రసవం చేయడం.. గుండెపోటు వస్తే సకాలంలో వైద్యం అందించడంవంటి పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తుంటారు.

## ఉమ్మడి జిల్లాలో 140 మంది పైలెట్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 108 అంబులెన్స్‌లలో మొత్తం 140 మంది పైలెట్లు విధులు నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లాలో 15 వాహనాలు ఉండగా, 40 మంది, ఆదిలాబాద్ జిల్లాలో 19 వాహనాలు ఉండగా, 45 మంది, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 14 వాహనాలు ఉండగా, 30 మంది, నిర్మల్ జిల్లాలో 9 వాహనాలు ఉండగా, 25 మంది పైలెట్లు పనిచేస్తున్నారు.

## సంతృప్తిగా ఉంది



*అంబులెన్స్‌లో 16 ఏళ్లుగా ఈఎంటీగా పనిచేస్తున్న. ఆపద సమయంలో ఘటనా స్థలానికి వెళ్లి.. అంతకు రెట్టింపు వేగంతో బాధితులను దవాఖానకు చేర్చడం మాకు సవాల్‌లాంటిది. విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నం. ఇందుకు సంతృప్తిగా ఉంది.*

**- పూదరి తిరుపతి, రెబ్బెన, ఆసిఫాబాద్ జిల్లా**

## గోల్డెన్ అవర్ చాలా కీలకం



*ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను దవాఖానకు తీసుకురావడాన్ని గోల్డెన్ అవర్‌గా భావిస్తాం. ఎందుకంటే ఆ సమయంలో ప్రతి క్షణం చాలా విలువైనది. అప్పుడు పైలెట్ అప్రమత్తంగా లేకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తది. అందుకే అత్యంత అప్రమత్తంగా ఉండి సేవలందిస్తాం.*

**- మామిడి సత్యం, లక్షెట్టిపేట, మంచిర్యాల**

## కత్తిమీద సాములాంటిది



*ప్రతి కేసు మాకు కత్తి మీద సాములాంటిదే. ఫోన్ రాగానే క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటాం. బాధితుడి ప్రాణాలు కాపాడడం మా బాధ్యతగా భావిస్తాం. సకాలంలో హాస్పిటల్‌కు చేర్పించడం వల్ల ఒకరి జీవితం నిలబడుతుంది. అందుకే 108 వాహనం వెళ్తున్నప్పుడు దారి ఇవ్వడానికి సహకరించాలి.*

**- కొత్తకాపు సతీశ్ కుమార్, నిర్మల్**

## కరోనా సమయంలో భయపడకుండా సేవలందించాం



*కొవిడ్ సమయంలో భయపడకుండా బాధ్యతగా సేవలందించాం. కరోనా రోగులను పక్కన పెట్టుకొని పనిచేయడం ప్రమాదమే. అయినా తప్పనిసరి పరిస్థితుల్లో సేవలందించాం. విధి నిర్వహణలో ఉన్న సమయంలో ఎలాంటి కేసులు వచ్చినా చాలెంజ్‌గా తీసుకొని పని చేస్తుంటాం. ప్రజలు మాపై చూపుతున్న ఆదరాభిమానాలు ఆనందాన్నిస్తాయి.*

**- ఎండీ వసీమ్, ఆదిలాబాద్**

## పైలెట్‌ల సేవలు కీలకం



*108 పైలెట్‌ల సేవలు అత్యంత కీలకం. ప్రతి వాహనంలో ఈఎంటీతో సమానంగా పైలెట్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అంబులెన్స్ నిర్వహణతో పాటు ఘటనా స్థలానికి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా వాహనం నడుపాల్సి ఉంటుంది. నిత్యం వందలాది మందిని హాస్పిటల్స్‌కు చేర్చుతుంటారు. ప్రజల ప్రాణాలను కాపాడితే వచ్చే ఆనందం మాటల్లో చెప్పలేనిది.*

**- బీ సంపత్, 108 మంచిర్యాల జిల్లా కార్యనిర్వహణాధికారి**


